


# చెన్నయ్‌ని తన కేంద్రంగా చేసుకుని, సినిమాలకు దూరమవుతూ, కూచిపూడి నృత్యాన్ని విశ్వవిఖ్యాతం చేసినవాడు వెంపటి చినసత్యం

# ఘన సత్యమును విశ్వం తెలుసుకున్న సత్యం!



ఏ దేశం వెళ్ళినా, మేము వెంపటి చినసత్యంగారి శిష్యులం, ప్రశిష్యులం అంటారెల్లరు నాట్యగురువులు. ఆంధ్ర దేశంలో 'కూచిపూడి' చిన్నఅగ్రహారం ఉందనీ, సిద్ధేంద్రయోగి అనే అపర నటరాజు కూచిపూడి నృత్యానికి 'నాంది' పలికాడనీ, రహదారి వసతుల్లేని ఆ వూరికే చక్రవర్తులు, పాదుషాలు, రాజులు, కవిరాజులు, కళాసామ్రాట్టులు వంటివారు ఆ అగ్రహారాన్ని దర్శించి, ఆ నందాబ్దిలో మునిగిమునకలు వేస్తూ, పులకరించారన్నది క్రీస్తు పుట్టడానికి పూర్వంగల చరిత్ర.



అటువంటి కూచిపూడి పవిత్ర గడ్డమీద 1929 సం॥ము అక్టోబర్ 16వ తేదీన పుట్టిన కూచిపూడి బ్రాహ్మణుల బిడ్డ వెంపటి చినసత్యం. కౌటుంబిక సాంప్రదాయానుసారంగా (పుట్టిన ప్రతీ మగబిడ్డా) కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు, చెన్నపట్టణ మహానగరం చేరుకుని, సినిమా మేఘ వ్యామోహంలో చిక్కుకుని, ఇది సరికాదు కూచిపూడి నృత్యాన్ని పదిమందికి నేర్పుతాను, ఆధ్యాత్మికపరమైన ఈ కళ విశ్వవ్యాప్తం కావాలని పట్టుదలతో, తానున్న స్థానం నుంచే దీక్షా దక్షతతో త్యాగరాజనగర్‌లోని ప్రకాశం రోడ్‌లో కూచిపూడి ఆర్టు అకాడమీని నెలకొల్పి, సిద్ధేంద్రయోగిలా హేమా హేమీ తారలైన హేమమాలిని, చంద్రకళ లత వంటి ఎందరినో తన అకాడమీకి రప్పించుకుని, గగన స్థాయి కెదిగిన నాట్యగురువు వెంపటి చినసత్యం ఒక్కడే ఒక్కడు. అంతకు పూర్వం తెలుగు సినిమా రంగంలో నాట్యగురువులుగా భాసిల్లుతున్న వేదాంతం రాఘవయ్య, తన జ్యేష్ఠ భ్రాతృడు వెంపటి పెదసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి, జగన్నాధశర్మ, ఉత్తరాదినున్న ఉదయశంకర్, పశ్చిమానున్న గోపీకృష్ణ (వీరిరువురు కూచిపూడి నర్తకులు గాకపోయిననూ, ప్రఖ్యాత నాట్యాచార్యులు) అందరినీ మించిపోయి, ఒక్క సూర్యుడు ఎల్లజగములకు వెల్తురిచ్చుననునట్లు విశ్వవిఖ్యాత కూచిపూడి నాట్యగురువుగా కీర్తింపబడడమే గాకుండా తన శిష్యప్రశిష్యులనుగా గురువులుగా తీర్చిదిద్దిన ఘనత చిన్నసత్యానిదేనన్నది ఘనమైన సత్యం.

అణువంత గర్వమూ, చీమంత ఆడంబరమూ లేనివాడు. అతని భార్య కూడా అంతటి నిరాడంబురాలే!

చినసత్యం రూపొందించిన కూచిపూడి నృత్య రూపాలన్నీ నాట్య కళామతల్లికి ఏడువారాల నగలు. పద్మావతీ శ్రీనివాస కళ్యాణం, విప్రనారాయణ చరితం, మేనకా విశ్వామిత్ర, కళ్యాణ శాకుంతలం, భామా కలాపం, ఛండాలిక, రుక్మిణీ కళ్యాణం, హరవిలాసం, శివధనుర్భంగం, అర్ధనారీశ్వరం వంటి అనర్ఘ రూపకాలంకార స్రష్ట సత్యమే. ఆ నృత్య రూపకాలన్నీ దేశవిదేశాంధ్రుల మనసులలో శాశ్వత ముద్ర వేశాయి.

**"కల్లెత్తితే సాలు కనకాభిషేకాలు ఒక్క నవ్వే సాలు ఒజ్జిర వైడూరాలు..."**

అని ఎంకి పాటల కావ్యనాయిక గురించి నండూరి సుబ్బారావు రాసిన పాట చరణాలు, అక్షరాలా వెంపటి చిన సత్యంగారికి అనువర్తించుకోవచ్చు. ఆయన అలవోకగా కళ్ళు తిప్పితే, కోటి భావాలు చిప్పిల్లుతాయి. హస్తవిన్యాసాలలోనే అపురూపమైన నృత్య లాఘవాలు విలసిల్లుతాయి. పదం కదిపితే పదివేల నాదాలు పలుకుతాయి.

అలా, ఆంగిక, అభినయ లయకారకులాయన. అనర్ఘ ఆహార్య దుర్యులాయన. అభినవసిద్ధేంద్రయోగి కూచిపూడి, నృత్య సరళీ కాణాచి, కింకిణీ రోచి, కళాసరసిలో కెరలే కెరటాల లాంటి, శిష్య ప్రశిష్య గణ ప్రతిభా వీచి, కళాభారతి ముద్దుబిడ్డ వెంపటి చిన సత్యం. కూచిపూడి శాస్త్రీయ నాట్య సంప్రదాయ పరిరక్షణకీ, పునరుద్ధరణకీ, ప్రాచుర్యానికీ, ప్రాబల్యానికీ తమ జీవితమంతా అంకితం చేసిన మహనీయుడాయన. కాసులకోసం ఆశపడనివాడు.

### కూచిపూడి బాసాడిగా...

అందరు కూచిపూడి భాగవతుల లాగానే ఆయన కూడా, ఆయన 1929 అక్టోబర్ 15వ తేదీన కూచిపూడి గ్రామంలోనే జన్మించారు. కౌటుంబిక సంప్రదాయానుసారంగా, కూచిపూడి నృత్య సరళినే అవలంబించారు. తాడేపల్లి పేరయ్యశాస్త్రి, వెంపటి చినసత్యం వంటి తెలుగు నేలపై తేజరిల్లిన నృత్య కళ విశ్వమంతటా కళా వెలుగును ప్రసరింపజేస్తూంది!

నృత్యం ఒక వేదం, ఇంకా చెప్పాలంటే అది యోగవిద్య. ఆనందం, ఆహ్లాదం కలిగించడమే గాకుండా ఆరోగ్యాన్ని ప్రసాదించు వేదం; దీర్ఘాయుః ప్రదాత. శివుడు ఆనందం కోసం దేవి పార్వతితో కూడి తాండవమాడేవాడని – శివుడు తాండవమాడెనన్న మనపూర్వుల పాటే ఉన్నది. రతీ మన్మథులు కూడా నృత్యప్రియులు. సిద్ధేంద్ర యోగి, భరత ముని వంటివారు నృత్య శాస్త్రానికి ఆద్యులు. పూర్వపు తెలుగు రాజులందరూ నాట్యాన్ని ప్రోత్సహించడమే కాదు, నాట్యశాస్త్ర గ్రంథాలను రచించారు. కూచిపూడి, భరత నాట్యములు విశ్వమంతటా వ్యాపించి విశ్వజనులను ఆనందింపచేస్తున్నాయంటే తెలుగువారే కారణం!

### తెలుగునేలపై తేజరిల్లిన నృత్యం

కూచిపూడి నాట్యం చూడాలని ఆసక్తిగలిగినవారికి తరచూ వినిపించే, కనిపించే నృత్యనాటకాలు కలాపాలు, తరంగాలు. కలాపం అంటే కలత, కలహం అని అర్థం. ఆడపిల్ల గోడు వెళ్లబోసుకోడాన్ని కూడా కలాపం అనే అంటారు.

వేదికమీద ప్రదర్శించే భామాకలాపంలో భామకలాపానికి భాగవత కథ నేపథ్యంగా వుంటుంది. కలాపాలలోనూ బహు జనాదరణ పొందినది భామాకలాపం, గొల్లకలాపం. భామాకలాపం రమణీయ శృంగార దృశ్య కావ్యం. అపురూప నృత్యనాటకం. ఈ పేరులో కనిపించే భామ శ్రీకృష్ణుని ప్రియభామ సత్యభామ. ఈ నాటకం పేరెత్తగానే మన చెవిలో వినిపించే గీతం 'భామనే సత్యభామనే'. దీన్ని సిద్ధేంద్రయోగి రచించాడు. తొమ్మిది రాత్రులు ఏకధాటిగా సాగే తొలి తెలుగు నృత్య నాటకం ఇది. అష్టవిధ నాయికలకు, నవరసాలకు, చతుర్విధ అభినయాలకు ఎంతో అవకాశం కల్పించి రూపొందించిన నృత్య నాటకం ఇది. ఇందులో నాయిక విప్రలబ్ధ. మంచి ఆహార్యానికీ, అభినయానికి అపార అవకాశం ఉన్న నృత్య నాటకం ఇది. 1685లో ఈ నాటకం చూసి నిజం నవాబు అబుల్ హసన్ తానీషా ఆ నాటకం వేసిన కళాకారులు యజ్ఞన్న, నరసన్న, సూరన్నలకు 600ల ఎకరాలు క్షేత్రాన్ని నజరానాగా ఇచ్చాడు. అప్పటినుంచి ఈ నాట్యం పలు జాతీయ, అంతర్జాతీయ వేదికల నెక్కి మేధావుల, కళాభిమానుల ప్రశంసలు పొందుతూనే ఉంది. ఇందులో అభినయించిన కళాకారులకు లభించని సత్కారం లేదు. వీరి కీర్తి ప్రతిష్ఠలకు మేరలేదు. నాట్యభారతికి ఆంధ్రులు సమర్పించిన నృత్య నీరాజనం గొల్లకలాపం.

***మేధావుల మెదడుకే మేత వేయగల అంశాలు ఇందులో చాలా ఉన్నాయి. యజ్ఞ, యాగాలు, వాటి విధి, విధానాలు, వాటి ఉచ్ఛారణ వగైరాలు ఇందులో ఉన్నాయి. అందువల్ల ఇది కళాకారులకు కూడా కత్తిమీద సాము వంటిది. ఈ నాటకాన్ని జనబాహుళ్యంలోకి తీసుకురావడానికి బ్రహ్మశ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి విశేష కృషి చేశారు. కూచిపూడి నాట్యం ఆడవాళ్లకు అందుబాటులోలేని సమయంలో దీన్ని ఆడవాళ్లకు నేర్పడం ద్వారా విప్లవం తెచ్చిన శాస్త్రిగారు అనేకమంది దేవదాసీలకు నేర్పి విస్తృతంగా ప్రదర్శనలిప్పించారు.***





